హత్యల నోటుబుక్కు!

వసుంధర

"రంగారావు నెవరో చంపేశారట చూద్దాం వస్తావా?" అన్నాడు పుండరీ.

"నేనురాను. శవాల్ని చూడలేను నేను—" అన్నాడు వాసు.

పుండరీ వాసును నొక్కించలేదు. వాసు సంగతి పుండరీకి చిన్నప్పట్నించీ తెలుసు.

వాసుది మెత్తటి మనసు. ఎవరికే కష్టం కలిగినా చూడలేడు. జబ్బుల గురించీ, గాయాల గురించీ, అయితే వినను కూడా వినలేడు. ఆటువంటి చర్చలు వచ్చినపుడతనికి కళ్ళు తిరుగుతాయి. అవతలి వాళ్ళను ఆపివేయమనైనా కోరతాడు. లేదా తనే అక్కణ్ణించి లేచి వెళ్ళిపోతాడు.

వాసుతో కాస్త పరిచయమున్న ప్రతి ఒక్కరూ అతడు మంచివాడనీ, అతిమంచివాడనీ అంటారు.

వాసుకున్న ఈ మనస్తత్వంవల్ల అతడికి చాలా నష్టాలున్నాయి. ఒక పర్యాయం అతడి చేయి తెగితే ఆరక్తం

చూసి మూర్ఛపోయాడు. ఎవరో డాక్టరు దగ్గరకు తీసు కెళ్ళాల్సివచ్చింది. తీరా చూస్తే అదంత ప్రమాదకరమైన దెబ్బకాదు.

అంతేకాదు. ఇంట్లోకి తేలు, పాములాంటి వేవైనా వస్తే అతడు వాటిని కొట్టలేడు. తను కొడితే అవి గిలగిలా తన్నుకుని ఎలా బాధపడతాయో ఊహించుకుని అతడు ముందే వణికిపోతాడు. ఆఖరి కతను ఈగ, దోమ, చీమ, పేనులాంటి వాటిని కూడా చంపలేడు. ఎటొచ్చీ అందు వల్ల ఎవరికీ నష్టంలేదు.

ఇటువంటి వాసు హత్య చేయబడ్డ మనుషుల నెలా చూడగలడు? అసలు హత్యెలా జరిగిందీ ఎవరైనా వివరించి చెబుతుంటేనే అతను వినలేడు!

రంగారావు హత్య ఊళ్లో పెద్ద సంచలనం కలిగించింది. కారణం—రంగారావు పరమ దుర్మార్గుడు! అతన్ని చంపా లని చాలామంది అనుకున్నారు. చాలామందికి దమ్ములేక పోయాయి. దమ్ములున్నవాళ్ళలో కొందరు పులుసులోకి దుమ్ములేకుండా చితగ్గొట్టబడ్డారు. మిగతావాళ్ళు జైలుకి పోయారు.

రంగారావు దుర్మార్గుడేకాదు. చాలామంది దుర్మా ర్గులకులాగే పలుకుబడి ఉన్నవాడు కూడా.

రంగారావు గాంబ్లింగ్ హౌసెస్ నడుపుతాడంటారు. సినిమాహాళ్ళదగ్గర మనుషుల్ని పెట్టి బ్లాకులో టికెట్లమ్మి స్తాడంటారు. ఇవి అతడు రహస్యంగా చేసే పనులు. అయితే అతను పబ్లిగ్గా చేసేపనులు కొన్నున్నాయి. ఒకటి తాగడం. రెండు నచ్చిన ఆడపిల్లని ఎత్తుకుపోయి అనుభవించి వది లెయ్యడం.

ఒకసారి అనుభవించబడి వదిలేయబడినట్లు పోలీస్

స్టేషన్‌కు వెళ్ళి చెప్పుకునే ఆడపిల్లలీ దేశంలో ఉండరు. వాళ్ళు చాతనైనా చస్తారు, చావలేక బ్రతుకుతారు - తప్పితే ఆ దుర్మార్గుణ్ని పట్టివ్వడానికి ముందుకురారు.

రంగారావు కళ్ళబడకుండా ఆడపిల్లల్ని దాచుకోవడం ఆ ఊళ్ళో చాలామందికి అవసరమని తెలుసు. అతని కళ్ళబడి ఆకర్షించిన పిల్లయితే కట్టుదిట్టాలేమాత్రం సడలించినా అతడు కాజేసుకుపోతాడు.

ఎవరో ఒకరు-ఆ పశువని చంపేస్తే ఎంత బాగుండును? అని అందమైన అమ్మాయిల తలిదండ్రులు, అన్నలు, భర్తలు అనుకుంటూండేవారు.

అలాంటి రంగారావు చచ్చిపోయాడు. అదీ హత్య చేయబడి!

హత్యయినా సామాన్యమైనదికాదు. రంగారావు తన గదిలో కుక్కచావు చచ్చాడు.

రంగారావుని అతడింట్లో అంతలా చంపగలిగిన హంతకుడు సామాన్యుడుకాదని ఊరంతా అలజడి బయల్దేరింది. అతణ్ని మహానుభావుడని ఆరాధించాలా, మరో దుర్మార్గుడవతరించాడని భయపడాలా అన్న మీమాంస తేలక చాలామంది బాధపడుతున్నారు.

ఏది ఏమైనా ఆ హంతకుడి ఆచూకీ మాత్రం తెలియ లేదు.

2

“ఈవేళ నువ్వు అయిదు నిముషాలు లేటుగావచ్చావు” అన్నాడు వెంకన్న తన అసిస్టెంటు సీతమ్మ వంకచూసి.

“ఆలస్యంగా రావడం నాకిది రెండోసారి. కానీ మీరు మెచ్చే కారణం ఆలస్యానికుండడం మాత్రం ఇదే మొదటిసారి అనుకుంటాను—” అంది సీతమ్మ.

"కారణం చెప్పకుండానే నేను నిన్ను మెచ్చుకుంటాననుకోవడం నీ అహంకారాన్ని తెలియజేస్తుంది. వాట్ డుయూ సే రాజమ్మా!" అన్నాడు వెంకన్న తన రెండవ అసిస్టెంటుతో.

"సీతమ్మ అహంకారి అని మీరంటే ఏ కారణమూ వినకుండానే నేను ఒప్పేసుకుంటాను" అంది రాజమ్మ.

సీతమ్మ కోపపడలేదు. మందహాసం చేయలేదు. తన జాకెట్లోపల్నుంచి ఓ చిన్న డైరీ తీసి వెంకన్న ముందుంచి "ముందిది చూడండి. మనం తర్వాత మాట్లాడుకుందాం!" అంది.

వెంకన్న కుతూహలంగా డైరీనితీసి చూశాడు. అది డైరీలాంటి పాకెట్ నోట్ బుక్. పైన ప్లాస్టిక్ కవరుంది. పుస్తకంలో మొదటి పేజీ వదిలేయబడి ఉంది. రెండవ పేజీలో ఆరంభంలో ఒకటి అనే అంకె వేసి ఉంది. దాని క్రింద ఇలా రాసి ఉంది.

'వాడు దాన్ని రేప్ చేసే ప్రయత్నంలో ఉంటాడు. నేను రెండో ఆట సినిమా చూసి వాడింటికి వెడతాను. తలుపు తడతాను. వాడు తీస్తాడు. నన్ను చూసి కంగారు పడతాడు. నేను జేబులోంచి బెల్టుతీస్తాను. వాణ్ని కొట్టడం ప్రారంభిస్తాను. వాడి వళ్ళు తట్లు తీరేలా కొడతాను. తర్వాత గదిలో దొరికిన కర్ర పుచుకొని వాడి బుర్ర బద్దలుకొడతాను. ఆ తర్వాతనే నేను తెచ్చిన కత్తి వాడిగుండెల్లో దిగబడి వెచ్చటి రక్తం గదిలో చిమ్ముతుంది. అప్పటికింకా అది కూడా అక్కడే ఉంటే దానికి ధైర్యంచెప్పి పంపేస్తాను.'

"ఇదెక్కడ దొరికింది నీకు?" అన్నాడు వెంకన్న.

"అలస్యానికి క్షమార్పణ చెప్పుకోవాలా? మీ

ప్రశ్నకు జవాబు చెప్పాలా?" అంది సీతమ్మ.

"లంచాలతో వెంకన్నను మభ్యపెట్టలేవు. ముందు క్షమార్పణ చెప్పి అపుడు జవాబు చెప్పు. నో జోక్స్. అయాం సీరియస్—" అన్నాడు వెంకన్న గంభీరంగా.

వెంకన్న ముఖంచూసి సీతమ్మ ముఖంలో రంగులు మారాయి—"ఆఫీసుకు వచ్చేటప్పుడు నేను సాధారణంగా పార్కులోంచి క్రాస్ చేసి వస్తూంటాను. ఈ రోజు అలాగే చేస్తూండగా పార్కులోని ఓ మనిషి—అంతసేపూ బెంచీమీద కూర్చున్నవాడు చటుక్కున లేచి వెళ్ళిపోవడం చూశాను. అతడు లేచినచోట ఈ నోట్ బుక్ వుంది. తీశాను. అతని కందజేయాలనుకున్నాను. కానీ అతనేదో హడావుడిలో ఉన్నాడు. అతన్ని కాసేపు అనుసరించి ఫెయిలైపోయాను. ఆ విధంగా అయిదు నిముషాలాలస్యమైంది. అందుకు నన్ను మన్నించండి బాస్. తర్వాత ఇందులోని వివరాలు చదివాను. అంతే! నాకు ముచ్చెమట్లూ పోశాయి—శరవేగంతో ఆఫీసుకు వచ్చేశాను...."

"రాజమ్మా—ఒక్కసారి రంగారావు హత్య గురించి మనకు తెలిసిన వివరాలు చదువు...." అన్నాడు వెంకన్న.

తనక్కావలసిన వివరాలు తీయడానికి రాజమ్మ కొద్ది సెకన్లు మాత్రమే తీసుకుని—"వినండి బాస్!" అంటూ ఆమె చదవడం ప్రారంభించింది.

హంతకుడెవరోగాని అతడికి రంగారావు మీద చాలా కసివుంది. ముందతన్ని బెల్టుతో బాదాడు. తర్వాత తల మీద గదిలోవున్న ఓ కర్రతో మోదాడు. ఆపైన కత్తితో పొడిచాడు. ఆ సమయంలో అక్కడొక స్త్రీ మసలిన చిహ్నాలున్నాయి. గదిలో కొట్లాట జరిగిన సూచన

లున్నాయి. పక్కమీద సంఘర్షణ జరిగిన సూచన లున్నాయి. ఆడవాళ్ళ జాకెట్ బొత్తాలు రెండు, చిరిగిన చీర పేలిక, అక్కడక్కడ తల వెంట్రుకలు పొడుగాటివి ఉన్నాయి. ఒక స్త్రీ అక్కడ పురుషుణ్ని ప్రతిఘటించిందనడంలో సందేహంలేదు. అయితే ఆ స్త్రీయే ఈ హత్య చేసివుంటుందనుకోవడానికి అవకాశాలంతగా కనిపించడంలేదు. రంగారావువంటి బలవంతుణ్ని ఒక స్త్రీ అంతలా హింసించలేదు. ఒకవేళ ముందుగా ఏ తలమీదనో కొట్టడమో, కత్తితో పొడవడమో అప్పుడు బెల్టుతో కొట్టిందనుకుందామన్నా—దెబ్బ తగిలాక కత్తిపోటు తిన్నాక—హా తెడు పెనుగులాడినట్లు కనబడదు. శవాన్ని కదిపిన సూచనలు లేవు. మరి బెల్టుదెబ్బలు—హాతుడి వీపు మీద కూడా వున్నాయి.

"ఈ నోట్ బుక్ రంగారావును హత్య చేసిన వాడిదంటావా?" అన్నాడు వెంకన్న.

"నేనేమీ అనను. తర్వాత పేజీలు చూడండి—" అంది సీతమ్మ.

వెంకన్న పేజీ తిరగేసి ఉలిక్కిపడ్డాడు. అక్కడ పైన రెండంకె వేసివుంది. దానిక్రింద ఇలా వ్రాసివుంది:

రాత్రి రెండో ఆట సినిమాచూసి వాడింటికి వెడతాను. వాడు తలుపులుతీసి నన్నాప్యాయంగా లోనికి ఆహ్వానిస్తాడు. నేను వాడితోపాటు లోపలకు వెడతాను. నా జేబులోంచి ఇన్‌హేలర్ తీసి—"ఇది చూశారా? కొత్తగా మార్కెట్లో వచ్చింది. దీని వాసన ఎంత బాగుందో" అంటాను. వాడు దాని వాసనచూసి స్పృహ తప్పి పడిపోతాడు. అప్పుడు వాణ్ని కూర్చున్న కుర్చీకే కట్టేస్తాను. తర్వాత జేబులోంచి కత్తితీసి—వాణ్ని తట్టి

లేపుతాను. చూస్తూండగా వాడి పీక కోసి మొండెంనుంచి తల వేరు చేస్తాను.

"మై గాడ్!" అన్నాడు వెంకన్న.

రాజమ్మ వణుకుతూ—"ఈ నోట్ బుక్ ఓనర్ని మళ్ళీ చూస్తే నువ్వు గుర్తుపట్టగలవా?" అంది.

"పట్టలేను. అతడి ముఖం సరిగ్గా చూడలేదు. అతడో కొత్తరకం ఎర్రపాంటు వేసుకుని ఉన్నాడు. ఆ పాంటు ఆధారంగానే అతన్ని కాసేపు అనుసరించి ఆఖరికి మిస్సయ్యాను—" అంది సీతమ్మ.

"ఎవడో తను చేయాల్సిన హత్యలన్నీ చక్కగా ముందే రాసిపెట్టుకున్నాడు...." అన్నాడు వెంకన్న.

"అప్పుడేఅయిపోలేదు. ఇంకా వున్నాయి చూడండి!" అంది సీతమ్మ.

ఈసారి పేజీ తిప్పుతూంటే వెంకన్న చేతులు వణికాయి.

అక్కడ....మూడంకె వేసివుంది.

నేను రెండో ఆట సినిమా చూసి వాడింటికి వెడతాను. తలుపులు తీసి వాడు నేనెవరినని అడుగుతాడు. వాడిని ఒక్క గుద్దుగుద్ది నేను లోపలకు వెడతాను. తిరిగి వాడు లేచేలోగా కత్తి వాడి గుండెల్లో దిగిపోతుంది.

తర్వాత పేజీలో నాల్గంకె వేసివుంది. అక్కడ....

అది నన్ను ఆప్యాయంగా ఆహ్వానిస్తుంది — రా అన్నయ్యా అంటూ. నేనా రాత్రి దానింట్లోనే భోం చేస్తాను. అది గదిలో పడుకుని నన్ను హాల్లో పడుకోమంటుంది. కాసేపలానే జరుగుతుంది. ఓ రాత్రివేళ నేను దాని మంచం మీదకు వెడతాను. అది ప్రతిఘటిస్తుంది. కానీ నా బలానికి లొంగిపోతుంది.

ఆ తర్వాత పేజీలో అయిదంకె వేసివుంది. అక్కడ ఒకే ఒక వాక్యం సగంలో ఆపి వేయబడివుంది.

రాత్రి రెండో ఆట సినిమాచూసి....

అంతే రాసివుంది.

"ఎవడో హత్యల గురించి పథకం వేసుకుని క్లుప్తంగా రాసిపెట్టుకున్నాడు. ఇంచుమించుగా అన్నీ ఒకలాంటి పథకాలే. ఆ హంతకుడెవరో తెలిస్తే బాగుండును!" అన్నాడు వెంకన్న.

"ఆ హంతకుడికి అందరిలోకీ రంగారావు మీదా, తర్వాత హత్య చేయబోయే వాడిమీదా చాలా పగ ఉన్నదనుకుంటాను...." అంది సీతమ్మ.

"ఈ నోట్ బుక్ రంగారావుని చంపినవాడిదేనని పిస్తోంది. దాన్నిబట్టి ఆలోచిస్తూంటే రంగారావు హత్యను ఒక స్త్రీ చూసిందనే చెప్పుకోవచ్చు, కానీ ఆ స్త్రీ ఎవరో ఎలా తెలుస్తుంది?" అన్నాడు వెంకన్న.

"పేపర్లో ప్రకటన వేస్తే?" అంది రాజమ్మ.

"దేనిగురించి?" అంది సీతమ్మ.

"రంగారావును చంపినవాణ్ని చూసిన స్త్రీ ఆ వివరాలను ఏదో రూపంగా డిటెక్టివ్ వెంకన్నకు అందజేయమని కోరుతూ పేపర్లో ప్రకటన చేయవచ్చు—" అంది రాజమ్మ.

"ప్రకటనకు ఖర్చవుతుంది? అదెవరు భరిస్తారు?" అన్నాడు వెంకన్న.

"ఎవరు భరిస్తారన్న ఆలోచన ఉంటే ఆ నోట్ బుక్ గురించి చర్చించడం టైమ్ వేస్ట్!" అంది రాజమ్మ ఉక్రోషంగా.

సరిగ్గా అప్పుడే బల్లమీద టెలిఫోన్ మోగింది. టెలి

ఫోన్ రంగుసుబట్టి అది వంటింట్లోంచి భార్యామణి పద్మావతీదేవి చేసినదేనని గ్రహించాడు వెంకన్న.

"హలో—దేవీ! ఏమిటి విశేషం?" అన్నాడు వెంకన్న.

"రంగారావు హంతకుడి ఆచూకీ తెలుసుకుందుకు మీరు పేపర్లో ప్రకటన వేయించండి—" అందామె.

"ఎందుకని?"

"ఆ హంతకుడి కార్యక్రమంలో ఓ ఆడదాని మానభంగం కూడా ఉంది...." అంది పద్మావతీదేవి.

"మగవాళ్ళ ప్రాణాలు పోయినా నీకు బాధలేదు కానీ—ఆడదాని మానం గురించి ఈ నిర్ణయం తీసుకున్నావా?" అన్నాడు వెంకన్న వెటకారంగా.

"అవును మరి. మీ మగాళ్ళ ప్రాణాలన్నీ ఆడదాని మానం చుట్టూ నేగదా ఉంటున్నాయి...." అంది పద్మావతీదేవి.

కిసుక్కుమని నవ్విన శబ్దం విని వెంకన్న తన అసిస్టెంట్సు వేపు చిరాగ్గా చూసి — "నా భార్య నాతో మాట్లాడుతున్నప్పుడు వినవద్దని మీ కెన్నిసార్లు చెప్పాను?" అన్నాడు.

వెంకన్నకు ఏ ఫోన్ కాల్ వచ్చినా వినేందుకు సీతమ్మకూ, రాజమ్మకూ సదుపాయముంది. అది వారు ఎప్పుడూ ఉపయోగించుకుంటూనే ఉంటారు. వెంకన్న కోప్పడగానే వాళ్ళు ఫోన్ క్రిందపెట్టేసి గప్ చిప్ అయిపోయారు.

"డబ్బుకోసం చూడకండి. పేపర్లో ప్రకటన ఇస్తారు కదూ?" అంటూ ఫోన్ పెట్టేసింది పద్మావతీదేవి. ఆవిడలా ఫోన్ పెట్టేసిందంటే అది విన్నపంకాదనీ, ఆజ్ఞ

అని అర్థం.

వెంకన్న ఫోన్ పెట్టేసి—"రాజమ్మా! ఏ సలహా పాటిస్తున్నాను. పేపరుకు ప్రకటన తయారు చేయించు" అన్నాడు.

రాజమ్మ నవ్వి "నా సలహా పాటిస్తున్నారా? మీ రెవరి సలహా పాటించారో నాకు తెలియదనుకుంటు న్నారా? నేనూ నా సలహా పాటించే వాళ్ళుండడం కోసమైనా త్వరగా పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను-" అంది.

3

"హలో!" అన్నాడు వెంకన్న.

"మాట్లాడేది డిటెక్టివ్ వెంకన్నగారేనా?" అంది ఓ స్త్రీ కంఠం.

"అసును—ఏం?"

"నేను పేపర్లో మీ ప్రకటన చూశాను?" అందా కంఠం.

"అలాగా—మీరు రంగారావింట్లో హత్య చూసిన స్త్రీయా?" అన్నాడు వెంకన్న. అతడి కంఠంలో కుతూహలముంది.

"అవును."

"వాట్ ...." ఉలిక్కిపడ్డాడు వెంకన్న. అది కలా, నిజమా అని వళ్ళు గిల్లుకున్నాడతను—"హలో వివ రాలన్నీ త్వరగా చెబుతారా!"

అదే ఫోన్ కాల్ సీతమ్మ, రాజమ్మ కూడా వింటు న్నారు. వినేది నోట్ చేసుకోవడం కోసం ఇద్దరి చేతు ల్లోనూ పెన్సిల్సు నోట్ బుక్సు సిద్ధంగా ఉన్నాయి.

"వెంకన్నగారూ! రంగారావు పరమ దుర్మార్గుడు.

అ విషయం చూచాయగా వినివున్నా ఆ రోజతడు నాపట్ల పశుత్వం వహించేవరకూ దుర్మార్గం అనేది ఎంత భయంకరమైన విషయమో అర్థంచేసుకున్నాను. అటువంటి వాణ్ని హంతకుడనకూడదు. యోధుడనాలి. ఆ దృశ్యం కళ్ళారా చూసినందుకు నాకెంతో ఆనందంగా ఉంది. ఆ మహానుభావుణ్ని పూజించాలి తప్పితే జైలుపాలు చేయకూడదు. అనవసరంగా మీరీ కేసుపై ఆసక్తి చూపకండి! స్త్రీ లోకం ధన్యవాదాలర్పిస్తున్న ఆ మహానుభావుడికి ఆపద తలపెట్టకండి."

ఫోన్ క్లిక్‌మంది.

"హలో! హలో!" అన్నాడు వెంకన్న నిరుత్సాహంగా.

"రాజమ్మ సలహాలవల్ల ప్రయోజనం పొందిందెవరు?" అంది సీతమ్మ.

"బాస్! సీతమ్మ మీ సతీమణినే అవమానిస్తోంది—" అంది రాజమ్మ.

"వాట్—నువ్వు శ్రీ వెంకన్న సతీమణివా? నాకు తెలియదే—" అంది సీతమ్మ.

రాజమ్మ ముఖం ఎర్రగా అయింది. ఆమె ఏదో అనబోయేంతలో బల్లమీద ఫోన్ మ్రోగింది.

"హలో!" అన్నాడు వెంకన్న.

"నా పేరు శివుడు. మా అన్నయ్య విష్ణువు నెవరో హత్య చేశారు!" అందవతలి కంఠం.

"హలో! ఇది డిటెక్టివ్ వెంకన్న యిల్లు. ఇక్కడ జోక్స్ వినబడవు—" అన్నాడు వెంకన్న.

"అహూం సారీ వెంకన్నగారూ—నేను జోక్ చేయడంలేదు. మా అన్నయ్య విష్ణువునెవరో ఘోరంగా

హత్య చేశారు. కుర్చీలో కట్టేసి తల కోసేశారు....”

వెంకన్న చేతిలోని రిసీవర్ జారిపోయింది.

“హలో! హలో!” అంటోంది అవతలి కంఠం.

వెంకన్న మళ్ళీ రిసీవర్ అందుకుని—“అంతా వివరంగా చెప్పండి!” అన్నాడు.

విష్ణువు అసలు పేరు విష్ణుమూర్తి. శివుడి అసలు పేరు శివరావు. ఇద్దరూ అన్నదమ్ములు. ఉన్నవాళ్ళేకానీ మరీ అంత పేరున్నవాళ్ళు కాదు. హత్యాస్థలానికి పోలీసులు వచ్చారు. తన అన్నని ఎవరంత ఘోరంగా చంపారో శివుడికి తెలుసుకోవాలనుంది. అందుకు అతను వెంకన్న సహాయం కోరుకున్నాడు.

వెంకన్న కూడా సీతమ్మను తీసుకుని హత్యాస్థలానికి వెళ్ళాడు. దారిలో అతను సీతమ్మతో “రాజమ్మ బదులు నిన్ను తీసుకువెళ్ళడానికి కారణం తెలుసా? నోట్ బుక్ ఓనర్ని చూస్తే గుర్తుపడతావని!” అన్నాడు.

“కనపడతాడని మీకు నమ్మకముందా?”అంది సీతమ్మ.

“కనపడతాడన్న నమ్మకం నాకుంది. కానీ నువ్వు గుర్తుపడతావన్న నమ్మకం నాకు లేదు—” అన్నాడు వెంకన్న.

హత్యాస్థలం వారు చేరుకునేసరికి పోలీసులింకా అక్కడేవున్నారు. వెంకన్న, పోలీస్ ఇన్స్పెక్టర్ ఒకరినొకరు పలకరించుకునావరు. అయితే వెంకన్న రాకపట్ల ఇన్స్పెక్టర్ అంత కుతూహలం చూపించలేదు.

వెంకన్నకు తెలిసిన ముఖ్య విశేషమేమిటంటే—హంతకుడు తనకు సంబంధించిన ఆచూకీ ఒక్కటి కూడా వదిలిపెట్టినట్లు కనబడడంలేదు. ఎక్కడా వేలిముద్రలే లేవు.

పోలీసులు కాస్త నిరుత్సాహంగా ఉన్నారు.

శవం మాత్రం చాలా భయంకరంగా ఉంది. కుర్చీలో తలలేని మొండెం. దాని ఒడిలో తల.

వెంకన్న శివుడనబడే శివరావుని పలకరించాడు. తనకు తోచిన ప్రశ్నలన్నీ వేశాడు.

విష్ణువుకి పెళ్ళయింది. ఏడాదిక్రితం అతడి భార్య చనిపోయింది. అతడికి పిల్లలులేరు. భార్యపోయాక అతను కాస్త విరక్తుడయ్యాడు. రెండో పెళ్ళి గురించి చాలామంది అతన్ని ఒత్తిడిచేస్తున్నారు. అతడికింకా ముప్పై నిండ లేదు. అతడి పేరుమీద రెండులక్షల ఆస్తిఉంది.

"వారసులు లేకపోతే మీ అన్నయ్య ఆస్తి ఎవరికి చెందుతుంది?" అనడిగాడు వెంకన్న.

"నాకే!" అన్నాడు శివరావు.

"మీ అన్నయ్య భార్య ఎలా చనిపోయింది?"

"హఠాత్తుగా అస్వస్థురాలై మరణించింది—"

"అది సహజమైన చావేననుకున్నారా?"

"అయ్యా వెంకన్నగారూ నేను మిమ్మల్ని కోరింది మా అన్నయ్యను చంపిన హంతకుణ్ని పట్టుకోమని. మీరేమో మా యింట్లో యింతవరకూ పోయినవారి వివరాలడుగుతున్నారు...."

"తీగలాగితే డొంక కదలడమంటే ఇదే మరి?" అన్నాడు వెంకన్న.

"అంటే?"

"మీ అన్నయ్య పేరున రెండు లక్షల ఆస్తి ఉంది. ఆయనకు వారసులు లేకుండా చనిపోతే అది మీకే చెందుతుంది. అస్వస్థురాలై ఆయనభార్య పోయింది. తర్వాత ఆయన పోయాడు. అందువల్ల ఈ కేసుకి మొదటి అను

మానితుడు మీరే!" అన్నాడు వెంకన్న.

"బాగుందండీ—నీ చొక్కా మీద పురుగుందంటే నీ చేత్తోనే తీసెయ్యమన్నట్లు హంతకుణ్ని పట్టుకోమని మిమ్మల్ని పిలిస్తే నన్నే హంతకుణ్ని కమ్మనమని మీ పని సులభం చేసేసుకుంటున్నారు మీరు. నిజం చెప్పాలంటే అన్నయ్య హత్య జరిగిన సమయంలో నాకు పటిష్టమైన ఎలిబీ ఉంది!" అన్నాడు శివరావు.

"చెప్పండి!"

గతరాత్రి శివరావు యింట్లో లేడట. స్నేహితులతో పేకాడుతున్నాడట. పేకాటమధ్యలో అతడికి కళ్ళు తిరిగినట్లయి అప్పటికప్పుడు ఓ నర్సింగ్ హోంకు వెళ్ళి రాత్రంతా అక్కడే పడుకుని వచ్చాడట.

"నర్సిగ్ హోం అడ్రస్ చెబుతారా?"

శివరావు చెప్పాడు. సీతమ్మ నోట్ చేసుకుంది.

"ఇలా కళ్ళుతిరగడం మీకు అలవాటా?"

"అలవాటైతే నర్సింగ్ హోం కెందుకు వెడతాను? మొదటిసారి కాబట్టే కంగారుపడ్డాను...."

"అలా ఎందుకు జరిగిందంటారు?" అన్నాడు వెంకన్న.

"మనకత్యంత ఆప్తులైన వారికాపద కలిగేలా ఉంటే ఆ విషయాన్ని మెదడు ముందుగానే కనిపెట్టి సూచించగలదట. నిన్నరాత్రే ఈ విషయం స్ఫురించి ఉంటే నర్సింగ్ హోంకు బదులు ఇంటికే పోయి ఉండేవాణ్ని!" అన్నాడు శివరావు బాధగా.

"మీకు సైకాలజీ తెలుసా?" అన్నాడు వెంకన్న.

"ఏదో కొద్దిగా!" అన్నాడు కానీ శివరావు కా సంభాషణ పొడిగించడం పెద్దగా యిష్టం లేనట్లుంది. "వెంకన్నగారూ! మీరు కోరిన డబ్బిస్తాను. అన్నయ్యను

చంపిన హంతకుణ్ని వీలైనంత త్వరగా పట్టుకోండి—"
అన్నాడు.

వెంకన్న ముఖం గంభీరంగా అయిపోయింది "నా శక్తిని తక్కువ అంచనా వేసి నాకీ పని అప్పచెబితే మాత్రం తర్వాత మీరే విచారిస్తారు...." అన్నాడతను.

"అంటే?"

"హంతకుణ్ని నేను నిజంగానే త్వరలోనే పట్టుకోగలనన్న నమ్మకముంది—" అన్నాడు వెంకన్న.

తర్వాత వెంకన్న, సీతమ్మ కలిసి ఆతడు చెప్పిన నర్సింగ్ హోంకి వెళ్ళారు.

"అతడి పేరు శివరావు. ఇందాకనే ఈ విషయం పోలీసులు వచ్చి అడిగివెళ్ళారు. రాత్రంతా అతనిక్కడే ఉన్నాడు. మనిషిలో ఏ కంప్లైంటూ ఉన్నట్లు నాకు తోచలేదు. ఏదో గాబరాగా ఉందనీ తనను గదిలో పెట్టి గొళ్ళెం వేయమని కోరాడతను. అతనికి సుఖంగా నిద్ర పట్టడానికి ట్రాంక్విలైజర్సిచ్చి గదిలో ఉంచి బయట గొళ్ళెం వేసాను. మధ్యలో ఓసారి తలుపు తెరిచిచూస్తే అతను ప్రశాంతంగా నిద్రపోతూ కనిపించాడు-"అన్నాడు డాక్టర్.

"గదితలుపులు వేసి ఉండగా పారిపోవడానికి వేరే మార్గంలేదా?"

"గది కిటికీలకు ఇనపచువ్వలున్నాయి. వాటిని తొలగించడం చాలా కష్టం—"

"కష్టం కావచ్చు. అసాధ్యంకాదుగదా!" అన్నాడు వెంకన్న.

"పోలీసులా విషయం పరిశోధించి వెళ్ళారు. అన్నీ

చువ్వలూ ఒక్కలా ఉన్నాయి...."

వెంకన్న డాక్టరుకు థాంక్స్ చెప్పి అక్కణ్నించి బయల్దేరాడు.

4

"మీరు శివరావు ననుమానించడం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది!" అంది సీతమ్మ.

"ఇందులో ఆశ్చర్యానికేముంది? విష్ణుమూర్తి మరణం వల్ల శివరావు కొక్కడికే లాభముంది! పోలీసు లాలోచించిన విధంగానే నేనూ ఆలోచిస్తున్నాను" అన్నాడు వెంకన్న.

"అలాంటప్పుడు అత నేమిమ్మల్నెందుకాహ్వానించాడు"

"దీన్నే ముందరికాళ్ళకు బంధం వేయడమంటారు. పోలీసుల అనుమానం ఎటూ శివరావుపైనే ఉంటుంది. ఓ ప్రైవేట్ డిటెక్టివ్ తనకు రక్షణగా ఉండడం మంచిదని అతడు భావించి ఉంటాడు...."

"మీ రతన్ననుమానించడానికింకా ఏమైనా కారణాలున్నాయా?"

"ఉన్నాయి. ఉదాహరణకు ఎలిబీ విషయం అతను జరగబోయేది తెలుసుకుని కావాలని మరీ అది సృష్టించుకున్నాడనిపిస్తోంది. అన్నగార్ని హత్య చేయమని ఎవర్నో పురమాయించి తనేమో నర్సింగ్ హోమ్‌లో వుండిపోయాడు. అతన్ని హంతకుడని ఎవరూ అనలేరుకదా!" అన్నాడు వెంకన్న.

"ఊఁ" అంది సీతమ్మ ఇంకా చెప్పమన్నట్లు.

"నేను అతనే హంతకుడని అన్నపుడు అతను వెంటనే ఎలిబీ గురించి మాట్లాడాడు. ఏ తమ్ముడిపైనైనా ఇలాటి అభాండం పడిందంటే వెంటనే ఎలిబీ గురించికాక—

తోడబుట్టినవాణ్ని చంపుతానా, అందులోనూ అంత ఘోరంగా—అని వాపోతాడు. శివరావు వాపోవలేదు. ఎలిబీ గురించి మాట్లాడాడు. ఆరోపణ అబద్ధమని చెప్పా లన్న తపన తప్పితే—ఆరోపణకు—అతను అణుమాత్రం నొచ్చుకున్నట్లు లేదు...." అన్నాడు వెంకన్న.

"అప్పటికే పోలీసులు అడిగి ఉండడంవల్ల అలా ప్రవ ర్తించాడేమో!" అంది సీతమ్మ.

"అయినప్పటికీ నేనడిగినా అతడికి బాధ కలిగి ఉండా ల్సింది. అయితే నువ్వు చెప్పిన కారణం కూడా కొట్టేయ డానికి వీల్లేదనుకో!" అన్నాడు వెంకన్న సాలోచనగా.

"మీరో విషయం మరిచిపోతున్నారు. రంగారావు హత్యకీ, ఈ హత్యకీ సంబంధముందని మనమనుకుంటు న్నాం!" అంది సీతమ్మ.

ఈ సూచన వింటూనే వెంకన్న ఉలిక్కిపడి—"అవును నిజమే! ఈ కోణంనుంచి కూడా ఎన్నో విష యాలు పరిశీలించాల్సి ఉంది. అన్నట్లు నీకు శివరావులో—ఆ నోట్ బుక్ ఓనర్ పోలికలు కనబడ్డాయా?" అన్నాడు.

"అవుననీ అనలేను. కాదనీ చెప్పలేను. నాకు గుర్తు న్నది అప్పుడతను వేసుకున్న ఎర్రపాంటు మాత్రమే!"

5

"ఇదివరకటి ఊరుకాదు. ప్రాణాలర చేతిలో పెట్టుకుని బ్రతకాల్సొచ్చేలాగుంది—" అంటూ కుర్చీలో కూర్చో బోయాడు పుండరీ. అతను కూర్చునేలోగానే కెవ్వుమని అరిచాడు వాసు.

ఉలిక్కిపడి ఆగిపోయాడు పుండరీ.

"ఏమిటయిందండీ—" అంది యమున.

"వాడు కూర్చోబోయేచోట ఓ కండచేరు ఉంది. నేను

అది చచ్చిపోయిందనే అనుకున్నాను—" అన్నాడు వాసు.

అతడికి వళ్ళంతా చెమటలు పట్టేశాయి.

"ఏమిట్రా మరీను—చాదస్తం ఎక్కువైపోతోంది—" అన్నాడు పుండరీ.

"చాదస్తం కాదురా—అది నా బలహీనత!" అన్నాడు వాసు.

"ఏం బలహీనతో కానీ ఈయనతో కష్టంగా ఉందనన్నయ్యగారూ-ఓ రోజు ఈయన చూస్తూండగా పేనుకుక్కానని కళ్ళు తిరిగి పడిపోయారు. మరో రోజు బల్లపురుగును పట్టేసరికి కెవ్వుమని అరిచారు...." అంది యమున.

"నీలాంటి వాళ్ళకు బ్యాలన్సుగా ఉంచడం కోసమే భగవంతుడు కొందరు హంతకుల్ని సృష్టించాడేమో—అబ్బ....ఆ విష్ణుమూర్తిగారి శవాన్ని చూస్తే...."

"ఏమిటండీ ఆ విశేషం?" అంది యమున కుతూహలంగా.

"హంతకుడాయన్ను కుర్చీకి కట్టేసి పీక కోసేశాడు...."

"ఒరేయ్.... చెప్పకురా...." అన్నాడు వాసు కంగారుగా.

పుండరీ ముఖం గంభీరంగా అయిపోయింది—"ఒరేయ్ వాసూ! చెట్టంత మనిషివి నువ్వు. కండలు తిరిగివున్న నిన్ను చూస్తే కొంతమంది దొంగలు జడుసుకుని పారిపోతారు. ఇంట్లో నువ్వు నీ భార్యా తప్ప ఎవ్వరూ లేరు. నువ్విలా ప్రతి చిన్న విషయానికీ భయపడుతూంటే నీ భార్యకు ధైర్యం ఎలా ఉంటుంది చెప్పు? ఆమెకు నువ్వు కొండంత అండగా ఉండొద్దూ—"

వాసు మాట్లాడకుండా తల వంచుకున్నాడు.

భర్త చిన్నబుచ్చుకున్నాడని యమునకు అనుమానం వచ్చింది. "ఈ రోజుల్లో ఇంత మెత్తటి మనసుండేవారే అరుదు. ఇంత మంచివారు నావారు కావడం నా అదృష్ట మనుకుంటాను నేను. ఏదో వేళాకోళానికి ఆయన్ను వేధించినా ఆయన గురించి నాకే కష్టమూలేదు—" అందామె.

పుండరీ వెళ్ళిపోయాక—ఆప్యాయంగా భర్త జుట్టు లోనికి పోనిస్తూ—"పుండరీగారన్నారని కాదు కానీ—మీ సున్నిత మనస్తత్వాన్ని బయటవారు అర్థం చేసుకోలేరు. అందుకనైనా మీరు బయటివారి దగ్గర జాగ్రత్తగా ఉండండి—" అంది.

"పుండరీ నాకు బయటివాడు కాదు. ఆప్తమిత్రుడు-" అన్నాడు వాసు.

"కావచ్చు. కానీ ఎవరైనా మిమ్మల్ని నా ఎదుట చిన్నబుచ్చితే బాధగా ఉంటుంది. నేను మిమ్మల్నెంతగా ఆరాధిస్తున్నానో మీకేం తెలుసు!" అంటూ ఆమె అతడి జుత్తులోంచి చేయి బైటకుతీసింది. నేలమీద పాకుతున్న పేనుని చూస్తూ ఆమె—"అరే—మీకు పేలు పట్టాయే!" అంది.

"నీ తలలో ఉన్నప్పుడు నాకు పట్టకేం చేస్తాయి. కానీ నువ్వు దాన్ని చంపకు...." అన్నాడు వాసు.

"చంపనులెండి. బాత్రూంలో వదిలివస్తాను...." అని లోపలికి వెళ్ళి అవతల పారేసివచ్చింది యమున.

"నాకు త్వరగా భోజనం పెట్టు—" అన్నాడు వాసు ఆమె రాగానే.

"ఎందుకు?" అంది యమున.

"సెకండ్ షో పిక్చర్ కి వెళ్ళాలి!" అన్నాడు వాసు గంభీరంగా.

"అదేమిటండీ — మాత్రాత్తుగా చెప్పారు. నేనూ వస్తాను...." అంది యమున.

"నువ్వు రావద్దు. నేనొక్కడినే వెడతాను...." అన్నాడు వాసు.

యమున చిరాగ్గా—"మీరు సెకండ్ షోకి వెడితే నన్నెందుకు తీసుకువెళ్ళరు? నిజంగా పిక్చర్ కే వెడుతున్నారా—లేక...." అంటూ అర్థోక్తిలో ఆగిపోయింది.

"నీ ప్రశ్నకు జవాబు చెప్పను. త్వరగా భోజనం పెట్టు—" అన్నాడు వాసు.

6

"అనుకోకుండా వెనక్కి తోయబడి ఉంటాడు. లేచే లోగా పొడిచేశాడు హంతకుడు—" అన్నాడు ఇన్స్పెక్టర్. అతడి ముఖం చాలా చిరాగ్గా ఉంది.

"హంతకుడు బొత్తిగా ఒక్క క్లూ కూడా వదల్లేదని చిరాగ్గా ఉన్నట్లుంది ఇన్స్పెక్టర్ గారికి.... హంతకుడు మీకోసం హత్యచేయడు మరి!" అన్నాడు వెంకన్న.

"రావణాసురుడంతటి తెలివైనవాళ్ళే వరాలు కోరుకునేటప్పుడు చిన్న చిన్న తప్పులు చేసి ప్రాణాలమీదకు తెచ్చుకున్నారు. ఈ హంతకుడంతకంటె తెలివైనవాడా?" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ఆలోచించి చూస్తే మరో చిన్న క్లూ దొరుకుతుంది-" అన్నాడు వెంకన్న.

"ఏమిటది?" ఆత్రుతగా అడిగాడు ఇన్స్పెక్టర్.

"రంగారావు, విష్ణుమూర్తి, లచ్చన్న—ఈ ముగ్గురి హత్యలూ ఇంచుమించు ఒకే సమయంలో జరిగాయి—

అదీ సాధారణంగా సినిమా రెండో ఆట వదిలిన కాసే పటికి....” అన్నాడు వెంకన్న.

ఇన్స్పెక్టర్ ఆలోచనలోపడి—“అంటే హంతకుడు రెండో ఆట సినిమా చూసొచ్చి ఈ హత్యలు చేస్తున్నా డంటూరా?” అన్నాడు.

“అంతకంటే ముఖ్యంగా మీరు గ్రహించవలసింది - ఈ మూడు హత్యలూ ఒకే హంతకుడు చేసివుంటాడని! అంటే ఈ మూడు హత్యలకూ ఏదైనా కామన్ మోటివ్ ఉన్నదా అని!” అన్నాడు వెంకన్న.

ఇన్స్పెక్టర్ ఆశ్చర్యంగా-“మీరు చెప్పేదానికంటె ఎక్కువ మీకు తెలుసునని నా కనుమానంగా వుంది—” అన్నాడు.

“అనుమానముంటే ఉండనివ్వండి—నన్ను మాత్రం అనుమానించకండి!” అన్నాడు వెంకన్న.

ఈ జోక్కు నవ్వే మూడ్ ఇన్స్పెక్టర్ కున్నట్లులేదు. లచ్చన్న హత్యగురించి తీవ్రంగా ఆలోచిస్తున్నా డతను.

లచ్చన్నది కూరగాయల వ్యాపారం. నాలుగువేళ్ళు లోపలకు పోతున్నాయి. భార్యా ముగ్గురు పిల్లలు. అంతా పుట్టింటికి వెళ్ళారు. అతనొక్కడే వుంటున్నాడు వారం రోజులుగా. చుట్టుపక్కల వాళ్లేమీ సమాచారం ఇవ్వ లేకపోయారు రాత్రి జరిగిన విశేషం గురించి. ఎవ్వరూ ఏమీ చూడలేదంటున్నారు. లచ్చన్నతో ఎవరికీ అట్టే పరిచయమున్నట్లు కూడా లేదు.

చచ్చిపోయిన వారిలో

రంగారావు ధనికుడు కాదు గానీ ధనవంతులతో తు. దుర్మార్గుడన్న పేరుంది.

విష్ణుమూర్తి మధ్యరకం వ్యాపారి.

లచ్చన్న కూరగాయల వ్యాపారి.

ముగ్గురికీ ఏమీ సంబంధ బాంధవ్యాలూ, లావాదేవీలూ వున్నట్లులేదు. ఈ ముగ్గురినీ ఒక్కడే చంపాడనుకోవడంవల్ల కేసు క్లిష్టతరమవుతుందే తప్ప క్లూ దొరకదు.

ఇన్స్పెక్టర్ తన అభిప్రాయం వెంకన్నకు చెప్పాడు.

వెంకన్న నోట్ బుక్ విషయం ఇన్స్పెక్టర్‌కు చెప్పలేదు. ఈ మూడు హత్యలకూ సంబంధమున్నదన్న విషయానికి తిరుగులేని ఋజువు అదే!

వెంకన్నకు కలిగిన బాధ ఇంతా అంతా కాదు. కేసు బొత్తిగా ముందుకు వెళ్ళడంలేదు. జరగబోయే నేరాల గురించి తనకు ముందుగానే తెలిసింది. కానీ ఆ నేరాల గురించి ప్రజలనెలా హెచ్చరించాలో తనకు తెలియడంలేదు. అయినా ఈ హంతకుడెవరు? హత్యలు చేయడానికి అతనికున్న కారణాలేమిటో? అతనెవరెవరిని చంపడానికి ఎన్నుకున్నాడో? ఈ హత్యాకాండ ఎంతకాలం ఇలా కొనసాగిస్తాడో?

తనేమీ చేయలేడా? జరుగబోయేవన్నీ నిస్సహాయంగా చూస్తూ ఊరుకోవడమేనా?

"ఎందుకైనా మంచిది? ఈ మూడు హత్యల్నీ కలిపి పరిశీలిస్తున్నట్లు ప్రచారం చేయండి. ఒకోసారి ఇలాంటి ట్రిక్స్ క్లిక్ అవుతూంటాయి...." అన్నాడు వెంకన్న.

"ఇది నాకిష్టంలేదు!" అన్నాడు ఇన్స్పెక్టర్.

7

"ఏమండీ—మీరా నోట్‌బుక్‌ని సీరియస్‌గా తీసుకున్నట్లు కనబడదు. దేనికైతే నేను భయపడ్డానో అదే జరుగబోతున్నట్లుంది. మీరేం చేయలేరా?" అంది పద్మావతీదేవి.

"మొత్తం కేసంతా నీకూ తెలుసు....ఏదైనా ఉపాయం నువ్వే చెప్పు!" అన్నాడు వెంకన్న.

"నేను డిటెక్టివ్ భార్యనే కానీ డిటెక్టివ్‌ను కాను...." అంది పద్మావతీదేవి.

"నేను డిటెక్టివ్‌నే కానీ భగవంతుణ్ని కాను...." అన్నాడు వెంకన్న.

"అయితే మీ రేమీ చేయలేరా?" అంది పద్మావతీదేవి నీరసంగా.

"భగవంతుడంతటివాడు దుర్మార్గుల్ని పరిమార్చడం కోసం అవతారాలెత్తి తగిన అవకాశం కోసం ఎదురు చూసి—అప్పుడు దుష్ట సంహారం చేశాడు. నేను సామాన్య మానవుణ్ని. ఒక చిన్న అవకాశం లభిస్తే బాగుండునని ఆశిస్తున్నాను....ఇంతవరకూ నేను పట్టిన కేసులో ఫెయిలవలేదు. సగంలో వదిలిపెట్టవలసిన అవసరం రాలేదు. పోలీసులకు వివరాలందజేసినా చేయక పోయినా ప్రతి కేసుకూ అంతం మాత్రం చూడగలిగాను. దీనికీ అవకాశం రాకపోదు. ఒకే ఒక చిన్న...."

వంటింట్లో టెలిఫోన్ మ్రోగింది. వెంకన్న అందుకున్నాడు.

"సార్! ఈ రోజు నేనా నోట్‌బుక్ ఓనర్ని చూశాను. అతను ఎర్ర పాంటుతో బయట తిరుగుతూండగా గుర్తుపట్టాను. అత నేనన్న విషయంలో నాకేమీ సందేహంలేదు—" అంది సీతమ్మ.

"ఎవరతను?"

"విష్ణుమూర్తి తమ్ముడు శివరావు...."

"ఐసీ...ఫోంచేసి వస్తున్నాను. నువ్వక్కడే వుండు.." అన్నాడు వెంకన్న. తర్వాత భార్యవంక తిరిగి—"నే

ఎదురు చూస్తున్న చిన్న క్లూ దొరికినట్లే వుంది...."
అన్నాడు వుత్సాహంగా.

భోజనం చేసి ఆఫీసురూంకు వెళ్ళగానే సీతమ్మను చూసి "ఈ రోజు నువ్వు చాలా పెందరాళే వచ్చినట్లున్నావు" అన్నాడు. అప్పటికింకా రాజమ్మ రాలేదు.

"అవును బాస్. అమ్మ యింట్లో కాఫీపొడి అయి పోయిందంటే నేను వుదయం షాప్ కెళ్ళాల్సొచ్చింది. అప్పుడా ఎర్రపాంటువాణ్ని చూశాను. వుత్సాహం ఆగ లేదు...." అంది సీతమ్మ.

"చూసీచూడగానే నాకా శివరావు మీద అనుమానం కలిగింది. వాడి కళ్ళు భయంకరమైన ఆలోచనలు సూచి స్తున్నాయి. మనిషి చాలా లోతైనవాడని అనిపిస్తోంది. ముఖంలోకూడా హంతకుడి ఛాయలు కనబడుతున్నాయి. సాధారణంగా నా అంచనా తప్పుకాదు...." అన్నాడు వెంకన్న.

"ముఖంచూసి హంతకుడెవరో చెప్పగలిగితే ఇంక పరిశోధన ఎందుకు?" అంది సీతమ్మ.

"ఋజువుల కోసం! కోర్టులు జోస్యాలు నమ్మవు గదా!" అన్నాడు వెంకన్న.

కాసేపట్లో రాజమ్మ వచ్చింది. ముగ్గురూ కలిసి కేసును తీసుకున్నంగా చర్చించారు.

"అన్నట్లు మనం వదిలేసిన పాయింటొకటుంది. ఆ నోట్ బుక్ లోని దస్తూరీ శివరావుదేనో కాదో తెలిస్తే పోయేదిగా__" అంది రాజమ్మ.

"ఆ ఐడియా నాకెప్పుడో వచ్చింది. దస్తూరీ శివ రావుదే అని గ్రహించినంతమాత్రాన మనమేమీ చేయ లేము. సీతమ్మ అతణ్ని సరిగా గుర్తుపట్టలేకపోవడంవల్ల __

ఆ ఎర్రపాంటు వ్యక్తి వేరేమనిషై వుంటాడన్న భ్రాంతిలో నేను నోట్‌బుక్ దస్తూరీ గురించి పట్టించుకోలేదు. ఇప్పుడు శివరావుపై మన అనుమానం పెరిగింది. దస్తూరీ కూడా పోల్చి ఒక్కక్షణం కూడా అతన్ని వదిలిపెట్టకూడదు-" అన్నాడు వెంకన్న. మాటలైతే ఆపాడు కానీ అతని ఆలోచనలింకా కొనసాగుతున్నట్లు కళ్ళు సూచిస్తున్నాయి.

"దస్తూరీ ఎలా సంపాదిస్తారు?" అనడిగింది సీతమ్మ.

"అందుకు రాజమ్మ వెడుతుంది. మగాడివంక కవ్వించే చూపులు చూసి అనుకున్న పని సాధించుకు రావడంలో రాజమ్మ గట్టిది!" అన్నాడు వెంకన్న.

సీతమ్మ తన కుర్చీని వెంకన్నకు దగ్గరగా జరిపి అతడి వంక అదోలా చూస్తూ—"అలా చూడ్డం నాకు చేత కాదంటారా?" అంది.

వెంకన్న ఆమెవంక చూసి—"మిస్ సీతమ్మా! ఇప్పుడలా చూడకు. నా మూడ్ పాడయిందంటే ఆలోచనలు తప్పుదారిని పడతాయి. ప్లీజ్!" అని—"ఈ కేసు నాకు అప్పగించింది శివరావు. అతడే హంతకుడైతే ఇందులో నాకు ఒక్క పైసా రాదు. డబ్బు కోసం రాజమ్మను శివరావు ఇంటికి పంపిస్తాను. అప్పుడు రాజమ్మ అతడి దస్తూరీ సంపాదించుకు రావాలి—" అన్నాడు వెంకన్న. అంటూనే అతడు శివరావుకు ఫోన్ చేసి తన అసిస్టెంట్‌ను పంపిస్తున్నట్లు చెప్పాడు.

రాజమ్మ బయల్దేరి కార్లో వెళ్ళి అరగంటలో తిరిగి వచ్చేసింది. శివరావు రెండువేలిచ్చాడు. ఆ మేరకు అతడి చేత ఓ వుత్తరం కూడా రాయించి పట్టుకొచ్చింది.

వెంకన్న ఆమెను మెచ్చుకుని నోట్‌బుక్‌నీ—ఆ దస్తూరీనీ సరిపోల్చిచూసి—"మై గాడ్—ఇది శివరావు

దస్తూరీయే—" అన్నాడు.

అనుకున్నదే అయినా అసిస్టెంటిద్దరూ అప్రయత్నంగా ఆశ్చర్యంతో నోరు తెరిచారు—"ఇప్పుడేం చేయాలి?" అంది ఇద్దరిలోకీ రాజమ్మ ముందు తేరుకుని.

"మనం కేసుల్ని ఎన్నో కోణాల్నుంచి పరిశీలించాం. రంగారావు, లచ్చన్నను చంపడానికి—శివరావుకుండే కారణాలు సూచనప్రాయంగా కూడా తెలియడంలేదు. అందుకే పరిశోధన కుంటి నడక నడుస్తోంది. ఇప్పుడు మనకు శివరావు హంతకుడని తెలిసిపోయింది. కాబట్టి త్వరగా ఋజువులు సంపాదించాలి. అన్నిటికంటే ముందు శివరావుని ఈ క్షణంనుంచీ నీడలా వెన్నాడాలి—" అన్నాడు వెంకన్న.

"ఇరవై నాలుగు గంటలూ ఓ మనిషిని వెన్నాడా లంటే ఒక్కరు చాలరు. ఈ పనికి నేను నా బాయ్ ఫ్రెండ్‌ని నియోగిస్తాను" అంది సీతమ్మ.

వెంకన్న నవ్వి అంగీకారం తెలిపాడు.

8

"తేలండీ—" అంది యమున.

అది చాలా పెద్ద తేలు. గోడకు మూలగా ఆగివుంది.

"ఎవర్నయినా పిలు—" అన్నాడు వాసు.

"తేలును చంపడానికి ఎవర్నయినా పిలిస్తే బాగుండదండీ—అనవసరంగా అంతా మిమ్మల్ని చూసి నవ్వుతారు. నాకది నచ్చదు. దాని సంగతి నేను చూస్తాను...." అంటూ మంచం దిగింది యమున.

రేడియోలో వస్తున్న తెలుగువార్తల్ని కట్టేశాడు వాసు. యమున గదిలోంచి బయటకువెళ్ళి ఓ చెప్పు, కర్రతో మళ్ళీ లోపలికి వచ్చింది. అది చూస్తూనే వాసు

వణకసాగాడు.

"ఏం చేస్తావ్?" అన్నాడతను.

"ఏదో ఒకటి చేస్తానెండి. మీరటుకేసి తిరగండి—" అంది యమున. ఇలాంటి సమయాల్లో ఆమెకు భర్తంటే అనుకోకుండానే చిరాకు కలుగుతూంటుంది.

వాసు అటుకేసి తిరగాలనే అనుకున్నాడు. కానీ భార్య తేలును చంపగలదా? ఒకవేళ అదామెను కుడితే! తేలు చంపబడుతుందన్న భయమూ, తేలు ఆమెను కుడుతుందన్న అనుమానమూ—రెండూ కలిసి అతణ్ని ఏ నిర్ణయానికీ తీసుకురాలేకపోతున్నాయి.

యమున కర్రతో తేలును పొడిచింది. తేలు గోడ వారనే నాలుగడుగులు ముంగుకి కదిలింది. ఆమె "కోడి.. కోడి....కోడి..." అంటూ ఆగిన తేలుని మళ్ళీ పొడిచింది. అలా గోడవారన కొంతదూరం కదిలాక తేలు శర వేగంతో తనదారి మళ్ళించి యమునను సమీపించింది.

కెవ్వుమని అరిచింది యమున.

తేలామెను కుట్టింది.

యమున బాధతో మెలికలు తిరిగిపోతోంది. తేలు వున్నట్లుండి ఆక్కణ్నించి మాయమైపోయింది.

వాసు చటుక్కున మంచం దిగి భార్యను రెండు చేతుల్తో ఎత్తుకునివచ్చి మంచంమీద పడుకోబెట్టి— "నొప్పిగా వుందా యమునా!" అన్నాడు.

ఆ సమయంలో యమునకు వళ్ళు మండిపోయింది— "లేదండీ—చాలా హాయిగా వుంది!" అంది.

"నన్ను క్షమించు యమునా!" అన్నాడు వాసు.

"ఈ బాధలో నేను ఎవరినీ క్షమించలేను. అయినా మీకేం భయంలేదులెండి. పారిపోయిన ఆ తేలు ఏ మూల

నుండో మిమ్మల్ని చూస్తూనే వుంటోంది. మీరు దాన్న యితే చంపలేరు కానీ నా బాధ చూడగలరు కదా!" అంది యమున. ఆమె బాధ భరించలేక గట్టిగా అరుస్తోంది. ఏడుస్తోంది. భర్తను తిడుతోంది. విషం పైకెక్కకుండా ఆమె మోకాలుకి గట్టిగా చీరకొంగుతో కట్టు కట్టింది. కానీ బాధ తగ్గలేదు.

వాసు ఉప్పు, కిరసనాయిలు, ఉల్లిపాయ వగైరాలుపయోగించు కొన్ని గృహవైద్యాలు చేశాడు. యమునకు ఉపశమనం కలిగినట్లులేదు.

"రాత్రి తెల్లవార్లూ ఈ బాధ నువ్వు భరించలేవు. నువ్వు బాధపడుతుంటే నేను చూడలేను. వెళ్ళి డాక్టర్ని కలిసివస్తాను...." అన్నాడు వాసు.

"ఈ సమయంలో మీరిప్పుడెక్కడికీ వెళ్ళొద్దు—" అంది యమున.

"ఇంకా మన భోజనాలు కూడా కాలేదు. ఇప్పుడే వచ్చేస్తాగా...." అంటూ వాసు ఆమె అనుమతి కోసం ఎదురుచూడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

యమున బాధతో మూల్గుతూ కూర్చుంది. అలా ఎంతసేపుందో ఆమెకే తెలియదు. కాసేపటి కామెకు బాధ తగ్గకపోయినా వాసింకా రావడంలేదేమిటా అన్న బెంగ పట్టుకుంది. టైము చూద్దామంటే అలారం టైంపీసు బల్ల మీద అటు తిరిగివుంది. మంచం దిగి టైముచూసే ఓపి కామెకు లేదు. ట్రాన్సిస్టర్ రేడియో మంచం మీదే వుంది. ఆమె దాన్ని ఆన్ చేసింది.

రేడియోలో ఇంగ్లీషు వార్తలు వస్తున్నాయి.

"అబ్బా—టైం తొమ్మింది దాటిందా? ఏడున్నర కాకుండా బయల్దేరిన మనిషి ఇంతసేపే డాక్టరు దగ్గర

ఆగిపోయారు చెప్మా?" అనుకుంది యమున. అప్పుడే ఆమెకు భర్త వెళ్ళాక తను తలుపులు వేసుకోలేదన్న సంగతి గుర్తుకొచ్చింది. కానీ మంచం దిగి వెళ్ళి తలుపులు వేసే శక్తి ఆమెకున్నట్లులేదు.

"నేనింత బాధలో వున్నానని ఆయనకు తెలుసు. నన్నిలా నిర్లక్ష్యంగా వదిలి వెళ్ళిపోయారు. ఇంట్లో ఏమైనాపోతే ఆయన కర్మ. నే నేంచేస్తాను...." అనుకుంది యమున చిరాగ్గా.

చూస్తూండగా టైము పదయింది. పదకొండయింది.

యమున బాధ తగ్గడంలేదు. వాసు రావడంలేదు. యమునకు కంగారుపట్టుకుంది.

చివరికామె ఓపిగ్గా ఎలాగో ధైర్యం చేసుకుని— మంచం దిగి కుంటుకుంటూ వీధి తలుపులు వేయడానికి వెళ్ళింది.

అప్పుడే వీధితలుపులు తోసుకుని వచ్చాడో వ్యక్తి.

"ఏమండీ వచ్చారా!" అంది యమున. ఆ ప్రశ్న వేశాక వచ్చిన వ్యక్తి తన భర్తకాడని గుర్తించింది యమున. అతడిచేతిలో కత్తివుంది.

"అరవకు. అరిచావంటే చంపేస్తాను...." అన్నాడా వ్యక్తి తలుపులు వేస్తూ.

9

మంచంమీద పడుకుని నవల చదువుకుంటోందామె. ఎవరో తలుపు తట్టారు.

ఆమె నవల దిండుకింద పెట్టి లేచివెళ్ళి తలుపుతీసింది. ఎదురుగా కనబడ్డ వ్యక్తిని చూసి ఆశ్చర్యంగా—"నువ్వా అన్నయ్యా—లోపలకు రా!" అంది!

అతను మౌనంగా లోపలకు వచ్చాడు. ఆమె తలుపులు

వేసి అతన్ని సమీపించి—"నువ్వెంతో మంచివాడివి. నీ కారణంగా...." అని ఏదో అనబోగా అతడు మాట్లాడ వద్దన్నట్లు సైగ చేశాడు.

"ఏం—ఏం జరిగింది?" అందామె.

"నేనీపూట ఇక్కడే భోంచేస్తాను. ఈ రాత్రి ఇక్కడే పడుకుని ఉదయం వెళ్ళిపోతాను—" అన్నాడతను. అతనామెవంక నే చూస్తున్నాడు. కానీ అతడి కళ్ళామెను చూస్తున్నట్లనిపించదు. గుడ్డివాడి చూపులా ఉందది.

"చాలా సంతోషం. ఇప్పుడే వంట చేస్తాను—" అంటూ వెళ్ళిపోయిందామె.

అతనక్కడే మౌనంగా కూర్చుని ఉండిపోయాడు. తర్వాత ఆమె భోజనానికి పిలిస్తే వెళ్ళాడు. వడ్డిస్తే భోంచేశాడు.

తర్వాత ఆమె గదిలోంచి ఓ పాడతమంచం తెచ్చి హాల్లో వేసింది. దానిమీద దుప్పటిపరిచి తలగడ వేసి—"పడుకో అన్నయ్యా—" అంది. అతనా మంచంమీద పడుకుని కళ్ళు మూసుకున్నాడు. ఆమె తన గదిలోకి వెళ్ళి పడుకుంది.

అతనికి వెంటనే నిద్రపట్టినట్లుంది. సన్నగా గురక కూడా ఆరంభించాడు. ఆమెకు మాత్రం నిద్రపట్టినట్లు లేదు. చదువుతున్న నవలను మాత్రం ఆమె పూర్తి చేయలేదు. గదిలో దీపం ఆర్పేసి అతడి రాకలోని ఆంతర్యం గురించి ఆలోచిస్తూ మంచంమీద దొర్లుతున్నదామె. చాలా సేపటికి ఆమెకు నిద్రపట్టింది.

ఓ రాత్రివేళ అతను ఉలిక్కిపడి లేచాడు. మంచం మీద కూర్చుని కళ్ళు నలుముకున్నాడు. ఒక్కక్షణం

తర్వాత అతను మంచం దిగాడు. అడుగులో అడుగు వేసు కుంటూ ఆమె గదిలోకి ప్రవేశించాడు.

అప్పటికామెకు బాగా నిద్రపట్టినట్లుంది. వంటిమీద దుస్తులు అస్తవ్యస్తంగా వున్నాయి.

అతనామెను సమీపించి పరీక్షగా చూశాడు. చూస్తున్నకొద్దీ మనిషలో ఆవేశం పెరుగుతున్నదనిపించింది. చాలాసేపు అతను అచ్ఛాదన లేని ఆమె గుండెల వైపే చూసి నెమ్మదిగా ఆమెకు పక్కగా తనూ పడు కున్నాడు. అప్పటికీ ఆమెకు మెలకువరాలేదు.

అతనామెకు దగ్గరగా జరిగాడు. మీద చేయివేశాడు. అప్రయత్నంగా ఆమె అతడికి దగ్గరగా జరిగింది. అత నుత్సాహంగా ఆమెను కౌగిలిలో బంధించాడు.

ఆమె ఉలిక్కిపడి అతన్ని తోసేసింది.

అతనామెను మళ్ళీ దగ్గరగా లాక్కున్నాడు. ఈసారి ఆమె అతన్ని విడిపించుకోలేకపోయింది. కౌగిలిలో బిగి స్తూంటే భయంగా—"ఏమిటది?" అంది.

అతను జవాబివ్వలేదు. ఆమె బట్టలు విప్పడానికి ప్రయత్నిస్తున్నాడు.

ఆమె మళ్ళీ అతన్ని తోసేసి—"అరిచి నలుగుర్ని పిలుస్తాను. అవతలకు ఫో!" అంది.

అతను మొల్లోంచి కత్తితీశాడు — "అరిచావంటే వెంటనే చస్తావ్—మర్యాదగా లొంగిపో—" అన్నాడు.

ఆమె భయంగా అతడి చేతిలోని కత్తివంక చూసింది. అది తళతళ మెరుస్తోంది. తర్వాత ఆమె అతడి కళ్ళవంక చూసింది. అతడి చూపులు క్రూరాతిక్రూరంగా వున్నాయి.

"నన్ను చంపుతావా?" అందామె.

"చంపే ఉద్దేశ్యం నాకు లేదు. కానీ నువ్వా అవసరం కల్పిస్తే చంపడానికి వెనుదీయను...."

అతడి కంఠస్వరం కఠినంగా వుంది. అతడి చేతిలోని కత్తికంటే—కంఠంలోని కరుకుదనం, చూపుల్లోని క్రూరత్వం ఆమె నెక్కువగా భయపెడుతున్నాయి.

"ప్లీజ్ నా జోలికి రాకు...." అందామె.

అతడామెను సమీపించాడు.

"ప్లీజ్—వద్దు!" అందామె.

ఒక చేయి కత్తిని ఆమె గుండెలకు ఆన్చింది. రెండో చేయి ఆమె బట్టలను విప్పుతోంది.

ఆమె కళ్ళలో ప్రాణభయం—మనసులో బెదురు—శరీరమంతా అఘోరకమైన కంపన—భవిష్యత్తు గురించి ఎన్నోరకాల ఆలోచనలు.

అతడి కత్తి ఆమె గుండెలపై ఆని వుంది. ఇప్పుడామె గుండెలపై ఆచ్ఛాదన లేదు.

ఆమెకు అరవాలనివుంది. కానీ అరిస్తే ఆతను తన్ను చంపేస్తాడు.

అతడామెను దగ్గరగా లాక్కుంటుంటే ఆమె శరీరం అసహ్యంతో కంపిస్తోంది. కత్తి మనసును భయపెడుతూంటే తనువు అతడికి లొంగిపోతోంది.

ఆమెకిప్పుడు చేతనయింది ఒక్కటే—ఏడుపు!

అతడు సాచి ఆమెను లెంపకాయకొట్టాడు—"ఇడియట్! సంతోషంగా ఉండాల్సిన ఈ టైములో ఏడుస్తావా—నవ్వు.... ముందు నవ్వు...."

ఆమెకు నవ్వు రావడంలేదు. ఏడుపే వస్తోంది.

నవ్వకపోతే అతడు కొడుతున్నాడు. ఆమెను హింసించి

అనంది సున్నాడు.

చివరి కామె నవ్వింది. పిచ్చిదానిలా నవ్వింది.

10

"మూడు రోజుల్నించి నా ఫ్రెండ్సతన్ని పాడో చేస్తున్నారు. ఇంతవరకూ చెప్పుకోదగ్గ విశేష మేమీ జరుగలేదు...." అంది సీతమ్మ.

"మన పరిశోధన తప్పుదారిలో వెడుతున్న దేమోనని పిస్తోంది—" అన్నాడు వెంకన్న.

అప్పుడే అక్కడ టెలిఫోన్ ట్రింగుమన్నది.

"హాలో!" అన్నాడు వెంకన్న.

"హాలో—వెంకన్న గారేనా—?" అందవతల్నించి ఓ స్త్రీ కంఠం.

"అవును...."

"వెంకన్న గారూ! నేనో పెద్ద పొరబాటు చేశాను. ఒక దుర్మార్గుణ్ని సన్మార్గుడనుకుని వాడి ఆచూకీ ఇంత కాలమూ దాచిపెట్టాను. వాడు నిన్న రాత్రి నా యింటి కొచ్చాడు. గౌరవంగా అన్నయ్యా అని పిలిచాను. అయినా నన్ను....నన్ను....క్రూరంగా హింసించి....బల వంతంగా అనుభవించి వెళ్ళిపోయాడు...." ఫోన్లో మాటలు ఆగి ఏడుపు ఆరంభమైంది.

"హాలో—మీ రెవరో చెబుతారా?"

"నే నెవరో తెలుసుకుని మీ రేం చేస్తారు? రంగా రావుని చంపిన హంతకు డెవరో చెబుతాను. వెళ్ళి అతన్ని పట్టుకోండి. నేనుమాత్రం ఈ కేసులో బయటకు రాద ల్చుకోలేదు. అడ్రస్ నోట్ చెసుకోండి—" అంటూ ఆమె గబగబా ఓ చిరునామా చెప్పి ఫోన్ పెట్టేసింది.

"ఈ అజ్ఞాత యువతి ఎవరో?" అంటూ నిట్టూర్చాడు

వెంకన్న.

"నోట్ బుక్‌లో వ్రాసిన ప్రకారమే ఒక్కొక్క నేరమే జరిగిపోతోంది. మనం అనుకున్న శివరావు హంతకుడు కాదు—" అంది రాజమ్మ.

"ఈ యువతి చెప్పిందే నిజమైతే హంతకుడి పేరు వాసు. అతనింతవరకూ తటస్థపడలేదు. వెంటనే అతన్ని కలుసుకోవాలి...." అన్నాడు వెంకన్న.

"మన కైంపు శివరావుమీద వృథా అయింది. నిన్నరాత్రి కూడా శివరావు ఇల్లువదిలి బయటకు రాలేదట—" అంది సీతమ్మ.

"ఈ వాసు ఎవడో ఈ హత్యలన్నీ ఎందుకు చేస్తున్నాడో తెలుసుకోవాలి. అయితే అజ్ఞాత యువతి మాట పట్టుకుని అతడింటికి వెళ్ళి నేరస్థుడని ఎలా చెబుతాం? ఇంతవరకూ జరిగిన నేరాల్లో ఒక్కదానికీ క్లూలేదు. హంతకుణ్ణి స్వయంగా చూసినామె అతడి పేరు, చిరునామా చెప్పింది కానీ తను బయటపడ్డంలేదు. కేసు చాలా క్లిష్టంగా వుంది—" అన్నాడు వెంకన్న.

"అసలు ఇన్స్పెక్టర్ గారి పరిశోధన ఎంతవరకూ వచ్చిందో? ఆయనేమైనా కొత్త విశేషాలు తెలుసుకున్నాడేమో?" అంది రాజమ్మ.

"అవును. అన్నట్లు నేనోసారి ఇన్స్పెక్టర్ని కలిసి రావాలి. ఈలోగా ఏదైనా అర్జెంటు మెసేజుంటే అక్కడికి ఫోన్ చేయండి—" అంటూ లేచాడు వెంకన్న.

11

వెంకన్న పోలీస్ స్టేషన్ చేరేసరికి అక్కడొక యువతి, యువకుడు ఉన్నారు. వారిద్దరూ భార్యాభర్తలని తెలుస్తూనే వుంది.

"వీళ్ళెవరు?" అన్నాడు వెంకన్న ఇన్స్పెక్టర్‌తో.

"నిన్నరాత్రి వీళ్ళింట్లో దొంగతనం జరిగింది. రిపోర్టివ్వడానికి వచ్చారు...." అన్నాడు ఇన్స్పెక్టర్.

"దొంగతనమెలా జరిగింది?" అన్నాడు వెంకన్న.

ఆ యువతి వివరించి చెప్పి—"ఆయన లేని సమయంలో వాడింట జొరబడి ఇంట్లోని విలువైనవన్నీ మంగళసూత్రాలతో సహా మూటకట్టుకుని పోయాడు. ఆ సమయంలో వాడు నా జోలికి రానందుకు సంతోషించాను...." అంది.

వెంకన్న దొంగతనం గురించి మరికొన్ని ప్రశ్నలు వేసి ఎక్కడ జరిగిందో అడిగి—ఆమె చెప్పిన సమాధానం విని ఉలిక్కిపడి వాళ్ళ పేర్లు అడిగాడు.

ఆమె పేరు యమున, అతడి పేరు వాసు!

వెంటనే వెంకన్న ముఖం గంభీరంగా అయిపోయింది-"మిస్టర్ వాసూ! నిన్ను నేను కొన్ని ప్రశ్నలడగాలి!"

"అడగండి!" అన్నాడు వాసు వినయంగా.

"నిన్నరాత్రి తెలుసుకుందు తీసుకొస్తానని చెప్పి నువ్వెక్కడికి వెళ్ళావ్?" అన్నాడు వెంకన్న.

సమాధానంగా వాసు నవ్వి ఊరుకున్నాడు.

"సమాధానం కావాలి నాకు..." అన్నాడు వెంకన్న.

యమున కలగజేసుకుని—"ఈ ప్రశ్నడగడంవల్ల మీకేమిటి ప్రయోజనం?" అంది.

"ఉంది కాబట్టే అడుగుతున్నాను...." అన్నాడు వెంకన్న.

"అదేమిటో చెప్పండి!" అంది యమున పట్టుదలగా.

"ఈ దొంగతనం నీ భర్తే చేయించాడు...." అన్నాడు వెంకన్న.

ఈ అభియోగానికి యమున, వాసు ఇద్దరూ తెల్ల బోయారు. "ఆయనింట్లో ఆయనే దొంతనం చేయాల్సిన అవసర మేముంది?" అంది యమున.

"ఈ రోజుల్లో చాలామంది మగాళ్ళకి ఆడాళ్ళకి తెలియని ఖర్చులుంటాయి. అందుకోసం ఇలాంటి నాటకా లాడుతూంటారు. లేకపోతే ఏడున్నరకు బయటవెళ్ళిన నీ భర్త రాత్రి మూడింటికి తిరిగిరావడ మేమిటి? ఇంట్లో ఒంటరి ఆడదుందని తెలిసీ మీద చేయివేయకపోవడ మేమిటి?" అన్నాడు వెంకన్న.

"చేతిమీద దోమవాలితే చంపలేని నా భర్త దొంగ తనానికంత ప్లానువేస్తారని నేననుకోను...."

యమున మాటలకు వెంకన్న నవ్వి—"చేతిమీద దోమను చంపలేనివాళ్ళు హత్యలు చేయలేరనుకోవడం చాలా తెలివితక్కువ. నిన్న రాత్రి నీ భర్త ఓ అమ్మాయిని మానభంగం చేసివచ్చాడంటే నమ్ముతావా?" అన్నాడు.

వాసు భయం భయంగా—"నిజంగా నాకేమీ తెలి యదు—...." అన్నాడు.

"రాత్రి ఎక్కడికెళ్ళావో చెప్పు...." అన్నాడు వెంకన్న.

"నిజంగా నాకేమీ తెలియదు...." అన్నాడు వాసు.

ఇన్స్పెక్టర్ విసుగ్గా—"ఇదంతా ఏమిటి మిస్టర్ వెంకన్నా!" అన్నాడు.

"ఏదో నా పిచ్చి. రిపోర్టివ్వడమైపోతే వాళ్ళను వెళ్ళమనొచ్చు—" అన్నాడు వెంకన్న.

12

"శివరావు గ్రంథసాంగుడే! అతడికి అమ్మాయిల పిచ్చివుంది. చచ్చిపోయిన రంగారావు అంతటివాడు

కాకపోయినా చాలాకాలంగా అతడో అమ్మాయిచుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ అమ్మాయే మన అజ్ఞాత యువతి కావచ్చనిపిస్తోంది—" అంది రాజమ్మ.

వాసుతో మాట్లాడటమయ్యాక వెంకన్న కేసు విషయంలో చాలా తీవ్రంగా పరిశోధించాడు.

శివరావుకీ, వాసుకీ ఎటువంటి సంబంధమున్నదో విచారించాడు. ఇద్దరి గుణగణాల గురించీ విచారించాడు. పరిశోధనలో వాసు చాలా అమాయకుడనీ, నిజంగానే చీమను కూడా చంపలేనివాడనీ తేలింది. అలాంటివాడు హత్యలు చేస్తాడన్న విషయం నమ్మడం కష్టం. అయితే హత్యలు, నేరాలు జరిగిన రోజుల్లో అతడికి ఎలిబీ లేదు. ఆ రోజుల్లోనే అతడు సెకండ్ షో పిక్చర్ కి వెళ్ళినట్లూ వెంటనే ఇంటికి తిరిగి రానట్లూ యమున డైరీలో వుంది. అతడికి శివరావుతో ఎటువంటి సంబంధంలేదు.

కానీ శివరావు గుణగణాలు మంచివికాదు. అతను తరచు వ్యభిచార గృహాలకి వెడుతుంటాడు. ఈ విషయంలో అతడికి సహకరించే ఒక వ్యక్తిద్వారా అజ్ఞాత యువతి వ్యవహారం బయటపడింది. వెంకన్న ఆమెను కలుసుకున్నాడు.

ఆమె పేరు రమ. ముందామె విషయం ఒప్పుకోలేదు. వెంకన్న దబాయించగా ఒప్పుకుని తన పేరు బయటకు రానివ్వద్దని వేడుకుంది.

"శివరావు నన్ను కోరాడు. నేను నిరాకరించాను. రంగారావు కన్ను నామీదపడేలా చేస్తానని బెదిరించాడు. అతనే అలా చేశాడో ఏమోకానీ నేను రంగారావు ట్రాప్ లోపడి అతనింటికి వెళ్ళాను. అక్కడ రంగారావు బలవంతం చేయబోయాడు. నేను ప్రతిఘటించి అలసి

పోయాను. నా సర్వస్వం దోచుకోబడే సందర్భంలో వాసు వచ్చి రంగారావుని క్రూరంగా హింసించి చంపి నా మానం కాపాడాడు. అతను నా జోలికి రాలేదు. సరిగదా సరైన ఆచ్ఛాదన లేని నా వంటిమీద గుడ్డ కూడా కప్పాడు. అప్పుడే నేనతన్ని నోరారా అన్నయ్యా అని పిలిచాను. ఈ సంఘటన జరిగాక శివరావు మళ్ళీ నన్ను సమీపించాడు. అతన్ని నేను తిప్పికొట్టాను. తర్వాత వాసువచ్చి నన్ను మానసికంగా హింసించి శారీర కంగా అనుభవించి వెళ్ళిపోయాడు. ఇదీ నా కథ. ఇందులో నా కింకేమీ తెలియదు—" అందామె.

"నువ్వు మొట్టమొదటే వాసు పేరు బయటపెట్టి వుంటే నేను నిన్ను రక్షించగలిగి ఉండేవాణ్ని—" అంటూ వెంకన్న ఆమెకు తన దగ్గరున్న నోట్ బుక్ చూపించాడు.

అది చదివి అదిరిపడింది రమ—"ఆ వాసు చాలా మంచివాడనీ నన్ను రక్షించడానికి వచ్చాడనీ అను కున్నాను నేను. ఆవేశంతో హత్యచేశాడు తప్పితే ఇలా పథకం ప్రకారం హత్యలు, నేరాలు చేస్తున్నాడని ఊహించలేకపోయాను. చేజేతులా ఘోరం అనుభవిం చాను...."

"ఇప్పటికైనా కళ్ళు తెరిచావు. ఆ వాసుని పట్టివ్వ డంలో సహకరిస్తావా?" అన్నాడు వెంకన్న.

"ఈ క్షణంనుంచీ మీరేం చెబితే అది చేస్తాను...." అంది రమ.

అతనక్కణ్నించి ఇంటికి వెళ్ళేసరికి—"బాస్ ఓ పెద్ద కనెక్షన్ దొరికింది—" అంది సీతమ్మ.

"ఏమిటదది?" అన్నాడు వెంకన్న.

"కూరగాయల లచ్చన్న రంగారావుకు ఆడపిల్లల్ని ఏర్పాటు చేసేవాడు. తన పేరు బయటకు రాకుండా చాలా పకడ్బందీగా వ్యవహరించేవాడు లచ్చన్న" అంది సీతమ్మ.

వెంకన్న బుర్రలో రకరకాల ఆలోచనలు మెదులుతున్నాయి. రంగారావు, విష్ణుమూర్తి, కూరగాయల లచ్చన్న, రమ-అందరికీ శివరావుతో సంబంధం వుంది. వాసు అతడి తరఫున నేరాలు చేస్తున్నాడు. అతడు కిరాయిగూండా కాదు. హత్యలు చేయగల ధైర్యం కూడా అతనికి లేదు.

ఏమిటీ విచిత్రం?

అప్పుడే అతడికి నోట్ బుక్‌లోని అయిదవ అంకె గుర్తుకొచ్చింది.

ఇంకా ఒక నేరం జరగాలి. ఈ నేరం కూడా వాసు చేస్తాడా?

ఇప్పుడు వాసుమీద వెంకన్న నిఘామనుషులున్నారు. అతణ్ని తెలివిగా ట్రాప్ చేయడం కోసం వాసుపై తనకు గల అనుమానాలను బహిర్గతం చేయలేదు వెంకన్న.

13

ఆ రోజు రాత్రి వెంకన్నకు ఫోన్ వచ్చింది—వాసు సెకండ్ షో పిక్చర్‌కి బయల్దేరినట్లు. వెంకన్న వివరాలు నోట్ చేసుకుని తనూ ఆ పిక్చర్‌కి వెళ్ళి వాసుని ఓ కంట కనిపెడుతున్నాడు.

సినిమా ఇంకా పూర్తికాకుండానే వాసు లేచాడు. అతడితోపాటే వెంకన్నా లేచాడు.

వాసు చకచకా నడుస్తున్నాడు. దారి అతడికి పూర్తిగా తెలిసినట్లే వుంది. వెంకన్న అతన్ని అనుసరి

స్తున్నాడు.

వాసు ఓ యింటిముందాగి తలుపు తట్టాడు. సుమారు ఇరవైయేళ్ళ కుర్రాడు తలుపు తీశాడు.

వాసు చివాలున లోపలకు అడుగుపెట్టి ఆ కుర్రాణ్ణి చేతో పట్టుకుని—"అరవకు—" అన్నాడు. అప్పుడే అతడి రెండో చేయి గాలిలోకి లేచింది. ఆ చేతిలో కత్తివుంది.

వెంకన్న వెనకనుంచే వాసు చేతిమీద ఓ దెబ్బవేశాడు. అతడి చేతిలోని కత్తి జారిపడింది. వాసు వెనక్కి తిరగ లేదు. అతడా కుర్రాడి పీక పట్టుకున్నాడు. ఆమాత్రా నికే ఆ కుర్రాడికి స్పృహ తప్పినట్లుంది.

వెంకన్న వాసు రెండో చేతిమీద దెబ్బవేశాడు.

వాసు చటుక్కున వెనక్కి తిరిగాడు.

"మిస్టర్ వాసూ! ఏమిటీపని!" అన్నాడు వెంకన్న.

"నా పేరు వాసుకాదు—" అన్నాడతను క్రూరంగా వెంకన్నవైపే చూస్తూ.

"మరేమిటి నీ పేరు?"

"శివరావు!"

ఉలిక్కిపడ్డాడు వెంకన్న—"మిస్టర్ శివరావ్! నువ్వేనా! రంగారావునీ, విష్ణుమూర్తినీ, లచ్చన్ననీ హత్య చేశావ్. రమకు మానభంగం చేశావ్....ఎందుకిదంతా చేస్తున్నావ్?" అన్నాడు.

"ఎందుకా?" రమ నాకు లొంగలేదు. లచ్చన్న సాయం అడిగాను. తనవల్ల కాదన్నాడు. నావల్ల కాదన్న వెధవ రమను రంగారావుకు అప్పజెప్పాడు. అందుకే రంగారావును లచ్చన్నను కూడా చంపేశాను. రమను మానభంగం చేసేశాను. ఆ సిక్కోసం అన్నయ్యాను చంపే శాను. ఇదుగో—ఈ కుర్రాడు....వీడు మా నాన్నకు

కలిగిన అక్రమ సంతానం. తనకు చదువు చెప్పిస్తేచాలు—మా పరువు పోకుండా తన బ్రతుకు తను బ్రతుకుతానన్నాడు. అయితే మాత్రం వీళ్ళెంతకాలం భరించేది?" అన్నాడు వాసు.

"నువ్వేమో—పేరు శివరావని అంటున్నావు. చూడ్డానికి వాసులా వున్నావు...." అన్నాడు వెంకన్న.

"అదా?" అని నవ్వాడు వాసు—"నాకు సైకాలజీ బాగా తెలుసు. మనం చేయాలనుకున్న పనులు మనం చేయక్కర్లేకుండా కొందరు బలహీన మనుష్యుల చేత చేయించవచ్చు. ఓసారి హోటల్లో ఎదురయ్యాడు వాసు. బయటవున్న ఊరకుక్కను నేను కొట్టాలనుకోగానే అతను కొట్టాడు. అప్పుడే నాకు అయిడియావచ్చి అతడి మీద ప్రయోగం ప్రారంభించాను. అతడి మెదడు నాకు వశమైంది. నేను నా గదిలో ఏకాగ్రత వహించానంటే అతనిక్కడ నేను చేయాలనుకున్నపని చేస్తాడు. అప్పుడతని మెదడు, ఆలోచనలు—అతనివి కావు. నావి...."

వెంకన్న ఆశ్చర్యంగా—"ఇది నేను నమ్మను. నమ్మలేను...." అన్నాడు.

"నమ్మినా, నమ్మకపోయినా ఇది నిజం...." అంటూ వాసు—"మిస్టర్ వెంకన్నా—నన్ను వదులు...." అన్నాడు.

వెంకన్న అతన్ని వదల్లేదు. మెడపక్కన ఏదో నరం మెలితిప్పి అతడికి స్పృహ తప్పించాడు.

* * *

శివరావు ఇంటిని హఠాత్తుగా దాడిచేయగా వాసు విచిత్ర స్థితిలో వెంకన్నకు చెప్పిన విషయాలన్నీ నిజమేనని తెలిసింది. వెంకన్నవంటివాడు నేరం చేసే

టప్పుడు వాసుకు ఎదురౌతాడన్న విషయం శివరావు గ్రహించలేదు. అందువల్ల వాసు నాలోచించుకునివున్న ఆలోచనలన్నీ అతను వెంకన్నకు చెప్పేశాడు.

శివరావు ఇంట్లో మానసిక శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలూ, అతడు హత్యలకు వేసుకున్న రకరకాల పథకాలూ, అతడు తన ప్రయోగాల విషయంలో తయారు చేసుకున్న నోట్సు అన్నీ దొరికాయి.

ఇటువంటి వింత కేసు తటస్థపడినందుకు పోలీసు అధికారులు అదిరిపోయారు. ఈ కేసు పరిశోధించిన, పరిశోధించగలిగిన వెంకన్నకు అభినందన పరంపరలు శాతాధికంగా వచ్చిపడసాగాయి.

అయితే విషయం వెంటనే వాసూ వరకూ వెళ్ళలేదు. ఒక రకమైన అపస్మారక స్థితిలో అతడు హత్యలు చేశాడు. ఆ వార్త విని అతడు మతిపోగొట్టుకుంటే ఆశ్చర్యంలేదు.

శివరావు అరెస్టయ్యాడు. వాసు విషయం ఏంచేయాలో లాయర్లకు వదిలిపెట్టాడు వెంకన్న. ఓ ప్రముఖ లాయరు వాసునీ కేసునుంచి రక్షిస్తానన్నాడు. అప్పుడాయన్ను తీసుకుని వెంకన్న వాసు ఇంటికి వెళ్ళాడు.

డాక్టరు సలహా పేరిట వాసు బెడ్ రెస్ట్ తీసుకుంటున్నాడు.

వెంకన్నను చూసి అతడు లేచాడు. వెంకన్న అతన్ని పడుకోమని — "నీ కోసం లాయర్ని తెచ్చాను—" అన్నాను.

"ఎందుకు?" అన్నాడు వాసు.

"నీకు తెలియకుండా నువ్వు చేసిన హత్యల విషయంలో నిన్ను రక్షించడానికి!"

"నేను హత్యలు చేశానా?" వాసు ఆశ్చర్యంగా

అడిగాడు.

వెంకన్న నెమ్మదిగా శివరావు పథకం గురించి చెప్పసాగాడు.

రంగారావు హత్యగురించి విన్నాడు వాసు. అతడి కళ్ళు పెద్దవయ్యాయి. విష్ణుమూర్తి హత్యగురించి వినగానే కెవ్వుమని కేక వేశాడు. అతడు తెరచిన నోరు తెరిచినట్లే వుండిపోయింది.

"ఏమయింది?" అన్నాడు లాయర్.

వెంకన్న వాసుచేయి బట్టుకుని నాడి పరీక్షించి— "పాపం యమునకు అన్యాయం జరిగిపోయింది—" అన్నాడు.

* * *

"అతడు చనిపోవడమే మంచిది. బలహీనమైన అతడి మెదడు గురించి తెలిశాక ఇంకా ఎంతమందికి దుర్బుద్ధి పుడుతుందో—" అన్నాడు వెంకన్న—భార్య పద్మావతీదేవితో మాట్లాడుతూ.

—: ఐపోయింది :—